

ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్‌సిసి ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవాభావం పెంపొందుతుందని ఎన్‌సిసి డిప్యూటీ డిజి ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఈ నెల 25న ప్రారంభమైన ఎన్‌సిసి క్యాడెట్స్ శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు సహకరించిన శ్రీప్రకాష్ సినర్జీ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, కల్నల్ హెచ్ఎస్.మానిక్, మేజర్ మహమ్మద్ ఆసిస్, పాల్గొన్నారు.

104 సిబ్బంది వేతన వెతలు

- అరకొర జీతాలతో అవస్థలు
- పూర్తిగా అమలు కాని పిఎఫ్, ఇఎస్ఐ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న 104 మొబైల్ మెడికల్ యూనిట్ సర్వీసెస్‌ను కూడా ప్రభుత్వం గతేడాది డిసెంబరులో అత్యవసర సేవల పరిధిలోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు అరబిందో ప్రైవేటు సంస్థ నిర్వహణ బాధ్యతలు చూడగా గత కొంతకాలం నుంచి భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ సంస్థ ఇప్పుడు బాధ్యతలు చేపట్టింది. ఇదంతా బాగానే ఉన్నా సంస్థలు మారుతున్నప్పుడల్లా సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. గత సంస్థ అనేక బకాయిలు పెట్టి బయటకు పోగా ఇప్పుడు చూస్తున్న భవ్య సైతం వేతనాల్లో కోతలు విధిస్తోందని సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 60 వాహనాలు ఉండగా అందులో డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా 160 మంది పని చేస్తున్నారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా గత ప్రభుత్వం ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అమలు చేయడంతో వీరంతా కీలక పాత్ర పోషించారు. గతంలో 104 సేవలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించేది. 5 ఏళ్ల పాటు అరబిందో సంస్థ బాధ్యతలు చూడగా ఇప్పుడు భవ్య



నిర్వహణ బాధ్యతలు తీసుకొంది. 104 ఉద్యోగులను ఆప్కాస్ చేర్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని 2019 అక్టోబరు 31న గత ముఖ్యమంత్రి జగన్ హామీని ఇచ్చినా అమలు చేయలేదు.

అరకొర వేతనాలు ఆపై కోతలు

గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ 104 వాహనాలు వైద్య సేవలందిస్తున్నాయి. సిబ్బంది ఈ వాహనంలో సంచరిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్దేశించిన గ్రామంలో ఉండి వైద్య సేవలు అందిస్తారు. ఈ వాహనాల్లో 30 రకాల వైద్యారోగ్య పరీక్షల కోసం పరికరాలు ఉంటాయి. గ్రామీణ ఆరోగ్యానికి ఈ వాహన సేవలు కీలకం. ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో ఈ వాహనాలు సేవలందిస్తాయి. వీటి ద్వారా వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా వర్కర్లు, నర్సులు సేవలందిస్తారు. 104 వాహనంలో డిఇఒ పైలెట్ కూడా ఉంటారు. ఆరోగ్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు కూడా అందిస్తారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న 104ను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని మరింత మెరుగు పరిచి సేవలను విస్తత పరచాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సిబ్బందికి అరకొర వేతనాలే అందుతున్నాయి.

అవి కూడా సక్రమంగా ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. పాత, కొత్త సంస్థలు చేసిన నిర్వాకంతో ప్రభుత్వం పెనాల్టీ విధించిందనే నెపంతో గత నెలలో రూ.1500 నుంచి రూ.2 వేల వరకు వేతనంలో కోత వేశారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను ప్రశ్నిస్తే వారికి సంబంధం లేదు అన్నట్టు వ్యవహరిస్తున్నారని, ఇదేమి విడ్డూరం అంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇచ్చే అరకొర వేతనంలో ఈ విధంగా కోత విధిస్తే తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పాత కంపెనీ అరబిందో వద్ద ఎరియర్స్ బకాయిలు ఒక్కొక్కరికీ రూ.20 నుంచి రూ.30 వేలు పెండింగ్ ఉన్నాయి. వీటిని ఎప్పటికి ఇస్తారనేది స్పష్టత లేదని సిబ్బంది తెలిపారు. గత సంస్థ ఫైనల్ సెటిల్‌మెంట్‌లో క్యాజువల్ లీవ్స్ కాక ఎర్న్ లీవ్స్ వివరాలు గత నెల పే స్లిప్‌లో లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ మారిన తర్వాత వేతనాలు తగ్గాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2020లో రూ.15 వేలు జీతంతో ఉద్యోగంలో చేరగా గడచిన ఐదేళ్లలో కేవలం రూ.900 మాత్రమే ఇంక్రిమెంట్లు పెరిగాయని తెలిపారు. పైగా కొత్త సంస్థ వచ్చిన తర్వాత వేతనాలు తగ్గిపోవడం వెనుక ప్రభుత్వం నిర్లక్ష్యం కనిపిస్తోందంటూ తెలిపారు.

ఉద్యోగ భద్రతపై ఆందోళన

గత ఐదేళ్ళ పాలనలో అనేక కష్టాలు పడిన 104 సిబ్బంది కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగ భద్రత కోసం ఎదురు చూసినా ప్రభుత్వానికి పట్టలేదు. ఇస్తున్న అరకొర వేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదు. అవీ నెలనెలా సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. జిఒ నెంబరు 4459 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలను సక్రమంగా అమలు చేయాల్సి ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. యాజమాన్యం చెల్లించాల్సిన ఎంప్లాయర్ కాంట్రిబ్యూషన్ చెల్లించడం లేదు. పిఎఫ్ విషయంలో ప్రభుత్వరంగ సంస్థల్లో సర్వీస్ ప్రొవైడర్ ద్వారా నిర్వహిస్తున్న సేవల్లో పిఎఫ్ ఒక వైపు ఉద్యోగి నుంచి మరోవైపు యాజమాన్యం చెల్లించాల్సి ఉంది. కానీ రెండు వైపులా ఉద్యోగుల నుంచే వసూలు చేస్తుండడం దారుణమని వాపోతున్నారు.

ఉద్యోగ భద్రత లేక ఆందోళన



104లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేక చాలా ఆందోళన చెందుతున్నాము. ఇష్టం వచ్చినప్పుడల్లా వేతనాల్లో కోతలు విధిస్తుండడం సరికాదు. ఇఎస్ఐలో కుటుంబ సభ్యులని చేర్చడం లేదు. ఒక్క వాహనానికీ బీమా లేదు. పూర్తిగా ఫిట్నెస్ లేని వాహనాలను తిప్పుతున్నారు.

- చెట్ల రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. ఎపి 104 ఎంప్లాయిస్ యూనియన్.

నేడు ఉచిత రక్తదాన, వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించే ఈ కంటి వైద్య శిబిరంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో అందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి వారికి ఆపరేషన్లు చేస్తారన్నారు. అవసరమైన వారికి కళ్ళజోళ్లు, ఉచితంగా మందులు సరఫరా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సత్యభాస్కరరావు ప్రజలకు పిలుపునిచ్చారు.

రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి

ప్రజాశక్తి - సామర్లకోట

పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ తొలుత రైల్వే స్టేషన్ బయట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయలకుం బాలం శ్రీనివాస్ మాట్లాడారు. జనరల్ బోగీలు పెంచాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఛార్జీలు తగ్గించాలని నిరసన వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యార్థం పాసింజర్ రైళ్లు అధికంగా నడపాలని, పాసింజర్ రైళ్లను రెగ్యులర్‌గా నడపాలని, ప్యాసింజర్ రైళ్లకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీల వసూళ్లను రద్దు చేయాలని, రైల్వే శాఖ తక్షణం ప్రజలకు మేలు కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలం శ్రీనివాస్, కరణం గోవింద్ రాజు, బాలం హరిబాబు, ఐటి వీరబాబు. కె.పవన్, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

నవోదయ కబడ్డీ పోటీల ముగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయలో మూడు రోజులపాటు నిర్వహించిన నవోదయ విద్యాలయాల ప్రాంతీయ కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు సభలో లలిత ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మట్టే ఆదిశంకర్, డాక్టర్ స్రవంతి ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవోదయ ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాల నవోదయ విద్యాలయాల నుంచి ఈ పోటీల్లో 458 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఆర్ట్ టీచర్ వీరాస్వామి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ ఆర్ సత్యనారాయణ, పి.అనురాధ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన హాస్టల్స్‌లో నిద్ర

ప్రజాశక్తి-కాకినాడ

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గురువారం సంక్షేమ హాస్టల్లో బస కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, కె.సిద్దు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్‌ను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులు మౌలిక సౌకర్యాలు లేవని, ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. నెలకు రూ.1600 ఇచ్చి మూడు పూటలా టిఫిన్, భోజనం చేయాలి అంటే ఏ విధంగా సరిపోతుందని విమర్శించారు. రోజుకి రూ.50తో విద్యార్థులు ఏ విధంగా జీవించాలని ప్రశ్నించారు. లోవరాజు, జయరామ్, కరుణ్ కుమార్, సంతోష్ పాల్గొన్నారు.



సంక్షేమ హాస్టల్లో బస చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు


ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలంలోని ఒమ్మంగిలో గ్రామ పంచాయతీకి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకున్నా చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఎంపిడిఒ కుమార్ బాబుకు గురవారం వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన ఎంపిటిసి రాయుడు రాజబాబు, మల్లిపాముల సూరిబాబు, మర్రి కామేశ్వరరావు, పలివెల సత్తిబాబు తదితరులు మాట్లాడుతూ గ్రామంలోని వినాయకుని గుడి ఎదురుగా ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని గ్రామానికి చెందిన నార్లంక నాగమణి ఆక్రమించి, ఆ స్థలం గుండా తన ఇంట్లోకి వెళ్ళడానికి శాశ్వత మార్గం ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. స్థలం తనదని అక్కడే ఒక ఖాళీ బడ్డీని పెట్టి ఇంట్లో వున్న చెత్త, రాళ్ళు, ఖాళీ స్థలంలోనే వేస్తూ కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఎంపిడిఒకు వివరించారు. ఆ పంచాయతీ స్థలాన్ని కాలనీవాసులు సామాజిక కార్యక్రమాలకు వినియోగించు కుంటున్నామని, ఆక్రమణ విషయమై ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు.



ఎంపిడిఒ కుమార్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కార్టూ'నిజం'





నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-కాకినాడ

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అర్బన్ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ప్రాజెక్ట్ అధ్యక్షులు నీరజ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో యూనియన్ జిల్లా అధ్యక్షులు దడాల పద్మ, ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి, సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకట రమణ హాజరై మాట్లాడారు. సభ అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అర్బన్ ప్రాజెక్ట్ అధ్యక్షులుగా ఎం.విజయ, కార్యదర్శిగా ఐ.రాజేశ్వరి, కోశాధికారిగా కె.సరోజిని, ట్రిప్స్ సొసైటీ కార్యదర్శిగా జి.రమణమ్మ, ఉపాధ్యక్షురాలిగా జి.రామలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా ఎంకె.జ్యోతి, నీరజ, సత్యవతి, డి.మేరీ రత్నం, ప్రియ, వి.రమణ, ఈశ్వరి, ఎం.వసంత, ఆర్.లక్ష్మి, సిహెచ్.రామ, శ్రీదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సూర్యభాస్కరరావును సన్మానిస్తున్న ఎంపిపి, తదితరులు

డిప్యూటీ ఎంపిడిఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి - జగ్గంపేట

ఉద్యోగ విరమణ చేసిన డిప్యూటీ ఎంపిడిఒ మేడవరపు సూర్య భాస్కరరావును జిల్లాలోని పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక శివ పార్వతి కళ్యాణ మండపంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో డిఎల్‌పిఒ బాలమణి మాట్లాడుతూ 43 ఏళ్లుగా భాస్కరరావు ఎటువంటి రిమార్క్ లేకుండా పని చేశారన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, ఎంపిపి అత్తులూరి నాగబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు మారిశెట్టి భద్రం పాల్గొని మాట్లాడారు. అనంతరం సూర్యభాస్కర రావు దంపతులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజపూడి, జె.కొత్తూరు, కాండ్రేగుల సర్పంచులు బుసాల విష్ణుమూర్తి, నకిరెడ్డి నాగేశ్వరరావు, బోదిరెడ్డి చక్రరావు, సర్వసిద్ధి లక్ష్మణరావు, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, సిడిపిఒ ఎం.పూర్ణిమ పాల్గొన్నారు.

సంకురాత్రి ఫౌండేషన్‌కు రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

యుఎస్ఎకు చెందిన ప్రవాస భారతీయులు ఆత్మీయ ఆర్గనైజేషన్ ద్వారా సంకురాత్రి ఫౌండేషన్‌కు రూ.రెండు లక్షల చెక్కును అందజేశారు. విద్యార్థినుల చదువు కోసం చెక్కు అందజేసిన వారి సాయాన్ని మరువలేమని కిరణ్ కంటి ఆసుపత్రి, సంకురాత్రి ఫౌండేషన్ అధినేత పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ అన్నారు. రూరల్ మండలం పెనుమర్తిలోని కిరణ్ కంటి ఆసుపత్రిని ఆత్మీయ ఆర్గనైజేషన్ సభ్యులు సందర్శించారు. అదనంగా రెండు వేల డాలర్లను కిరణ్ కంటి ఆసుపత్రి అధినేత సంకురాత్రి చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నైనాల ఆశ్రిత, నైనాల చాతుర్య, అర్యేహి చిక్కాల, నైనాల వెంకట్, నైనాల బిందు, చిక్కాల ఆనంద్, విజయ రామిశెట్టి, ఓంప్రకాష్ నక్కా, వెంకట్ ఎరుబండి, డాక్టర్ చిక్కాల పోతురాజు, సానా సతీష్ కుమార్ పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజా సమస్యలపై కౌన్సిలర్ల ధ్వజం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రోటోకాల్ విషయంలో అధికారులు నిబంధనలు పాటించ కుండా వ్యవహరిస్తున్నారని, పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్ల వ్యవస్థలు అధ్వానంగా పని చేస్తున్నాయని మున్సిపల్ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం ఇన్‌ఛార్జి మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల మరణించిన సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ మృతికి సంతాపం తెలిపారు. జీరో అవర్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ సహా మున్సిపల్ కౌన్సిలర్లు కరణం రాజకుమార్, ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ, పాగా సురేష్ కుమార్, యార్లగడ్డ జగదీష్ పాలిక కుసుమ, కాళ్ల శ్యామల, స్వయంభారపు వీరభద్రరావు, తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ వార్డుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి, శానిటేషన్ డ్రైన్ల నిర్వహణ లేక కంపు కొడుతుందని అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కెజె.రాజశేఖర్, ఆర్ఒ నూకరాజు, టిడిపి కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, కౌన్సిలర్లు సమస్యలపై మాట్లాడారు.



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి -కరప, యు.కొత్తపల్లి

విద్యుత్ ఛార్జీల నిలువు దోపిడీ ఆపి ప్రమాదకర అదానీ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజాసంఘల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కరపలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెట్టిన మీటర్లు తొలగించాలని, ఆగస్టు 5న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గ్రామ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘం నాయకురాలు సిహెచ్.రమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.వీరవేణి, ఆర్.వెంకటలక్ష్మి, ఎం.వరలక్ష్మి, సిహెచ్.వెంకటలక్ష్మి, బి.రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు, కెవివి.సత్యనారాయణ, సిహెచ్.సాంబశివకుమార్, జివిఎస్.రెడ్డి, ఎంఎల్ లిబరేషన్ నాయకులు జి.సత్యనారాయణ, జి.వినోద్, కె.కమలాకర్ పాల్గొన్నారు.



యు.కొత్తపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు



కరపలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

సమావేశంలో దళిత కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

దళిత వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని, వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని కౌన్సిలర్లు గంటా అప్పలస్వామి, బెండుకుర్తి సత్తిబాబు, ఇరుగుల యేసు మున్సిపల్ కమిషనర్ కనకారావును నిలదీశారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల గొల్లప్రోలు కౌన్సిల్ సమావేశం తిరస్కరించిన రూ.కోటి నిధులు నగర పంచాయతీకి ప్రత్యేక జిఒ ద్వారా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అభివృద్ధి పనులకు అనుమతి ఇచ్చారు. ఈ నిధుల్లో దళిత వార్డుల అభివృద్ధి పనులకు కేటాయింపులు లేవని, ఈ ఎజెండాలో ఒక్క రూపాయి కూడా ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. పట్టణంలో వీధిలైట్లు నిమిత్తం ఎజెండాలో రూ.ఐదు లక్షలు కేటాయించడంపై కౌన్సిలర్లు గంటా అప్పలస్వామి, గుళ్ల సుబ్బారావు, జ్ఞానేశ్వరి అభ్యంతరం తెలిపారు.



రహదారి పరిశీలిస్తున్న డిసిసిబి ఛైర్మన్ బాబు

గోరింట వద్ద కుంగిన రహదారి

ప్రజాశక్తి - పెద్దాపురం

సామర్లకోట-ప్రత్తిపాడు రహదారిలో గోరింట గ్రామం వద్ద రోడ్డు అడుగున మట్టి కుంగిపోయి పెద్ద గోయిపడింది. దీంతో ఇరువైపులా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వెంటనే రోడ్లు భవనాల శాఖ డిఇ కెఎస్.రాఘవరావుతో ఫోన్ ద్వారా మాట్లాడి యుద్ధ ప్రాతిపదికపై ఈ రహదారి నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవళ్ల బోసు, పెన్నాడ గోవిందు, దేవళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మిషన్ అన్నపూర్ణ సహాయనిధి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవత రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం పెద్దాపురం పట్టణ పరిధిలో వలస కూలీలకు అన్నదానం నిర్వహించారు. రాజేష్ కుమార్ మాట్లాడుతూ విల్లా శశాంక్ సహాయ సహకారాలతో పట్టణ శివారులలో నివసించే వలస కూలీలకు, కుటుంబాలకు అన్నదానం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మోజు లక్ష్మి, గుమ్మళ్ల ఉమా శేఖర్, సాలా నాగలక్ష్మి తదితరులు సహాయ సహకారాలు అందించారన్నారు.

విజయకుమారి సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-తాళ్లరేవు

ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయిని ములపర్తి విజయ కుమారి సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. గాడిమొగ హైస్కూల్లో గురువారం విజయ కుమారి ఉద్యోగ విరమణ సత్కార సభ హెచ్ఎం విజిటి.సునీత అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా నాయకులు గణేష్‌రావు, నగేష్, జెవివి నాయకులు కెఎంఎంఆర్.ప్రసాద్, యు.కొత్తపల్లి హైస్కూల్ హెచ్ఎం సురేష్ భూషణ్, రిటైర్డ్ హెచ్ఎం సత్య ప్రసాద్, హిందీ ఉపాధ్యాయిని సుమశ్రీ మాట్లాడారు. ఉపాధ్యాయిని సుమశ్రీ, పీడీ శ్రీనివాస్, ఎంఇఒలు ఉమా, మంగాయమ్మ, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి- కొవ్వూరు

కొవ్వూరు-దొమ్మేరు రోడ్డు మార్గంలో యాదగిరి నూకరాజుకు చెందిన హోటల్లో చోరీకి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. వీరి నుంచి రెండు గ్యాస్ సిలిండర్లను, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పట్టణానికి చెందిన ఎలుబండి నాగదుర్గా పవన్, ఎర్రంశెట్టి అంజి, దొమ్మేరుకు చెందిన గూడ పణిలను అరెస్ట్ చేశామన్నారు. వీరు కొవ్వూరుతో పాటు చాగల్లు, సమీస్రగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు మోటార్‌సైకిల్‌లను చోరీకి చేశారని తెలిపారు. నిందుతులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో నాలుగో వార్డ్ క్రిస్టియన్ పేటకు చెందిన చింతలపూడి శ్రీనివాస్(56) ఆర్థిక, అనారోగ్య ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గత కొంతకాలంగా శ్రీనివాస్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది బుధవారం అర్థరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు భార్య శ్రీదర్శిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. మతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి -తాళ్లరేవు

మండలం కోరంగి పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి 216పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నుండి యానం వైపు వెళ్తున్న కారు అమలాపురం నుండి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో కూర్చున్న మందపాటి సుభద్రయమ్మ (67) అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ సీట్‌లో ఉన్న ఆమె భర్త మందపాటి శ్రీరామరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రెప్పపాటులో కళ్ళ ఎదుటే భార్య మృతి చెందడంతో భర్త శ్రీరామరాజు దిగ్భ్రాంతికి గురయ్యాడు. సంఘటనా స్థలాన్ని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



నాగయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

మచ్చా నాగయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎర్ర జెండాయే స్ఫూర్తిగా బతికిన ప్రముఖ్య కమ్యూనిస్టు నాయకుడు మచ్చా నాగయ్యకు ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యాన గురువారం ఘనంగా నివాళు లర్పించారు. నాగయ్య ఇటీవల అమలాపురంలో మృతి చెందారు. గురువారం ఆయనకు మండలంలోని రామవరం రంగవల్లి నగర్ వద్ద సంతాప సభలో జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కడితి సతీష్, అర్జున్, లక్ష్మి, వీరబాబు పాల్గొన్నారు.

సీతబాబు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం గ్రామానికి చెందిన దాసరి సీతారామయ్య(సీతబాబు) ఇటీవల అకాల మరణం పొందారు. ఈ నేపథ్యంలో గురువారం వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సమన్వయకర్త తోట నరసింహం, మాజీ ఎంఎల్ఎ చిట్టూరి రవీంద్ర, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తోట శ్రీరాంజీ పరామర్శించారు. సీతబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. దాసరి చినబాబు, సుంకర రమణ, పాటి రాంబాబు, సుంకర.వీరబాబు, సమ్మెట మోహన్, తోట బాబ్జి, రాంకుర్తి మూర్తి, పాల్గొన్నారు.

165 వితంతు పింఛన్ల మంజూరు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని 20 గ్రామాల పరిధిలో నూనతంగా 165 మంది వితంతువులకు పింఛన్లు మంజూరు అయ్యాయని ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ గంటా శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు శుక్రవారం ఆయా సచివాలయ పరిధిలో ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో అందజేస్తామన్నారు. ఖండవల్లి వన్-12, ఖండవల్లి టు-2, కొత్తపల్లి అగ్రహారం-8, మల్లేశ్వరం-6, ముక్కామల వన్-11, ముక్కామల టు -6, నడిపల్లి-8, పెరవలి వన్-5, పెరవలి టు-5, పిట్టల వేమవరం-19, తీపర్రు -6, ఉసులుమర్రు-12, అజ్జరం-10, అన్నవరప్పాడు-10, కాకరపర్రు-15, కానూరు వన్-4, కానూరు టు-9, కానూరు అగ్రహారం-7, కాపవరం-6 మొత్తం 165 పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు.

ఎన్‌పిసిఐ లింకు చేయించుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

రైతులు తమ బ్యాంకు ఖాతాల్లో ఎన్‌పిసిఐ లింకును తక్షణమే చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.గోపాలకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని చిక్కాల గ్రామంలో ఎస్‌బిఐ బ్యాంకులో 43 మంది రైతులకు ఎన్‌పిసిఐ బ్యాంకు ఖాతాలు తెరిపించారు. మొత్తం 129 మంది రైతుల్లో మిగిలిన 86 మందిలో 13 మంది రైతులు మృతి చెందగా, మిగిలిన 73 మంది రైతులు వెంటనే బ్యాంక్ ఖాతాలకు లింక్ చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం



ఆసుపత్రిలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ చినరాజప్ప

పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్టు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు వైద్యులు ఆసుపత్రిలో ప్రస్తుత సమస్యలు, ఖాళీగా ఉన్న పోస్టుల గురించి వివరించారు. దీనిపై ఎంఎల్ఎ చినరాజప్ప స్పందిస్తూ వైద్య సేవలను మరింత విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, డాక్టర్ మానస, డాక్టర్ సిగ్గా, డాక్టర్ విద్య, నరేంద్రనాథ్, రమాదేవి, రంధి సత్యనారాయణ, తూతిక రాజు, కొరుపూరి రాజు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్ సునేత్రాదేవికి సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట ఇన్‌ఛార్జి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నియమితులైన రెండో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవిని గురువారం కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కౌన్సిల్ అత్యవసర సమావేశం అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సునేత్రాదేవిని కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రెడ్నం సునీత, పాలిక కుసుమ, కాళ్ళ శ్యామల, మర్రి శేషారావు, బలుసు శ్రీనివాసు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ప్రేమజంట వినతి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రేమ వివాహం చేసుకున్న తమకు పెద్దల నుంచి ప్రాణ హాని ఉందందంటూ ఒక ప్రేమ జంట గురువారం ఎస్‌పి బిందుమాధవ్‌ను ఆశ్రయించింది. తన తల్లిదండ్రులు, సోదరుల నుంచి తమకు హాని ఉందంటూ సర్పవరానికి చెందిన యాళ్ల రమ్య ఎస్‌పికి వివరించారు. మేజర్ అయిన తాను, నవర గ్రామానికి చెందిన వాకపల్లి సాయి గణేష్ ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నామన్నారు. సాయిగణేష్‌పై తన తల్లిదండ్రులు పెట్టిన కేసును వెంటనే తొలగించాలని కోరింది. వారికి ఇబ్బంది కలగకుండా చూస్తానని ఎస్‌పి హామీ ఇచ్చారని రమ్య, సాయిగణేష్ వివరించారు.

మార్కెట్ షెడ్లను పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం వారపు సంతలో రూ.36 లక్షలతో ఎండు చేపల వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు, సిమెంటు రోడ్లను గురువారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, డిఇ డిఎస్.ప్రకాశరావు, అసిస్టెంట్ ఇంజనీర్ పివి.సుధాకర్, సంత వ్యాపారుల సంఘం అధ్యక్షుడు కడియం శ్రీను పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల ముగింపు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దడానికి లీడర్‌షిప్ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని ఎంఇఒ డి.దావీదు అన్నారు. గురువారం చేబ్రోలు ఆదర్శ కాలేజీలో పాఠశాల లీడర్‌షిప్ ముగింపు శిక్షణ తరగతుల కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎఎంఒ పి.జగన్మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో ఆర్‌పిఎస్‌వి ఎవి.రామకష్ణ సిహెచ్.రవికుమార్, సత్యవేణి, జివిఎస్ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. మంచి వాతావరణంలో శిక్షణ తరగతులు జరిగాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులు వారిని సత్కరించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కేంద్ర ప్రభుత్వం క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వయం ప్రతిపత్తి సంస్థ మై భారత్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో, మోహన్ డిగ్రీ కళాశాల సహకారంతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా యువజన అధికారి టి.గోపి మాట్లాడుతూ యువత ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని, పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలను సూచించారు. ప్రిన్సిపల్ శ్రీరామ్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ రాజేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంఇఒగా తుమ్మల రంగారావు

ప్రజాశక్తి కాకినాడ రూరల్

రూరల్ మండల ఎంఇఒగా తుమ్మల వెంకట సత్య రంగారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.



తీర్థంలో పాల్గొన్న ప్రజానీకం

ఘనంగా మహాలక్ష్మి తీర్థం

ప్రజాశక్తి- తాళ్లరేవు

గాడిమొగ పంచాయతీ చినవలసలలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహాలక్ష్మి అమ్మవారి తీర్థం గురువారం కోలాహలంగా ప్రారంభమైంది. ప్రధాన దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. రామాలయం వద్ద నుంచి కళాకారుల నృత్యాలు, బాణాసంచాతో భారీ ఊరేగింపు నిర్వహించారు.

పి4 అర్హుల వివరాలు సేకరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పి-4 వివరాల సేకరణ వేగవంతంగా పూర్తి చేయాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ ఆవరణలోని విజన్-2047 కార్యాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన వివిధ శాఖల అధికారుల సమావేశంలో మాట్లాడుతూ సర్వే ఫైనల్ అయిన తర్వాత మార్గదర్శకాల ప్రకారం వ్యాపారవేత్తలు, ఉన్నత ఉద్యోగులు, సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానాల్లో ఉన్న వారిని గుర్తించడం, దత్తత మార్గదర్శకాలపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ శ్రీరమణి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి- సామర్లకోట

ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పెదబ్రహ్మదేవంలో సొసైటీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పిఎసిఎస్ చైర్మన్ తోటకూర రాజకుమార్, డైరెక్టర్లు మలకల వెంకటేశ్వరరావు, బొల్లి రఘుతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శీను బాబు, టిడిపి మండల అధ్యక్షుడు ముసిరెడ్డి శ్రీరాములు, తోటకూర శీను, పాలకుర్తి రవిబాబు, కుర్ర నారాయణస్వామి, గొల్లపల్లి సర్వేశ్వరరావు, మార్ని భద్రం, కొరుప్రోలు రవి పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో విఫలమైందని వైసిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ వంగా గీత తెలిపారు. గురువారం చేబ్రోలు కెసికె ఫంక్షన్ హాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో గీత మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హామీల మోసంపై వైసిపి కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉలవకాయల నాగలావరాజు, ఎంపిపి అరిగెల అచ్చియమ్మ, వైస్ ఎంపిపి బత్తిన మంగ, అరిగెల రామయ్యదొర, దాసం మహేష్, నానాజీ, సూర్యచంద్రరావు, శ్రీను పాల్గొన్నారు.

దాత సత్యనారాయణకు సన్మానం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణానికి చెందిన దాత వల్లభశెట్టి సత్యనారాయణ రూ.4 లక్షలతో 5000 లీటర్ల వాటర్ ట్యాంక్ నగర పంచాయతీకి విరాళంగా అందజేసిన సందర్భంగా గురువారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు, కమిషనర్ ఎన్.కనకారావు కౌన్సిల్ సభ్యులు సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మొగలి అయ్యారావు, గంధం నాగేశ్వరరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, గంటా అప్పలస్వామి, రాంబాబు, గుళ్ల సుబ్బారావు, మొగిలి దొరబాబు పలువురు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి-కోటనందూరు

వైసిపి నేత చింతకాయల చినబాబు ఆధ్వర్యంలో గురువారం జగన్నాథపురం, భీమవరపుకోట, ఎస్ఆర్.పేటలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి లాలం బాబ్జి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లగుడు శ్రీనివాస్, గొర్ల రామచంద్రరావు, జగటాల వీరబాబు, కొత్తపెళ్లి మాణిక్యాలరావు, సుర్ల రాజు, సామ్యూల్, సూరిబాబు రాజు పాల్గొన్నారు.

వైసిపి కౌన్సిలర్లు వాకౌట్

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం గురువారం మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే అభివృద్ధి పనులకు సంబంధించి రూ.78.50 లక్షలతో ప్రతిపాదించిన పనులలో వైసిపి కౌన్సిలర్లు ఉన్న 13 వార్డులు లేకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తూ, వైస్ ఛైర్మన్ ఎలగడ బాలరాజు, కామిశెట్టి వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో 13 మంది వైసిపి కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ ఎలగడ బాలరాజు మాట్లాడుతూ వైసిపికి చెందిన కౌన్సిలర్స్ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ తమ వార్డుల్లో పనులను ఎజెండాలో పొందుపరచడం లేదని విమర్శించారు. పట్టణంలో అభివృద్ధి పనులు మాత్రం వేగవంతంగా జరుగుతున్నాయని మున్సిపల్ ఛైర్మన్ తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కార్యనిర్వహణాధికారి నీలకంఠం

ఎంఎస్ఎన్ చారిటీస్ ఇఒగా నీలకంఠం

ప్రజాశక్తి-కాకినాడ

జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చారిటీస్ ఇఒగా బళ్ల నీలకంఠం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటి వరకు సామర్లకోట భీమేశ్వర స్వామి దేవస్థానం ఇఒగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎన్ సంస్థ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్య అందించడం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సంస్థ ఆదాయాల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుత ఇఒ కె.విజయలక్ష్మి, సూపరింటెండెంట్ జె.సోమరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.ఉషారాణి, హెచ్‌ఎం ఎం.ఎస్. సుబ్రహ్మణ్యం, గంగాధర్, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

వ్రత పురోహితుల హాజరు పట్టీ తనిఖీ

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న వ్రత పురోహితుల హాజరు పట్టీని చైర్మన్ ఐవి రోహిత్ గురువారం పరిశీలించారు. వ్రత మండపాల వద్దకు వెళ్లి హాజరు పుస్తకాలను పరిశీలించారు. కొందరు పురోహితులు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా సొంత పనుల మీద వెళ్లిపోయినట్టు గుర్తించారు. దీంతో చైర్మన్ రోహిత్ హెడ్‌లను పిలిచి విధులకు అందరూ హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్లో గురువారం 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రసాయన శాస్త్రంలో రసాయన చర్యలు, సమీకరణాల పాఠ్యాంశానికి సంబంధించి విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు. పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాన్సెప్ట్ ఆధారం చేసుకుని విద్యార్థులతో ప్రయోగాలు నిర్వహించడం ద్వారా శాస్త్రీయ అవగాహన అభివృద్ధి చేయడం అభినందనీయం అన్నారు.

కొమ్ము పురుగుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల పామ్ ఆయిల్ తోటలను ఆశిస్తున్న కొమ్ము పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఉద్యానవన శాఖ అధికారి కె.దివ్య అన్నారు. మండలంలోని పేరవరంలో పామాయిల్, అరటి ఇతర వాణిజ్య పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ కొమ్ము పురుగు తక్కువగా ఉన్న తోటల్లో లింగాకర్షక బుట్టలను వెంటనే ఏర్పాటు చేయాన్నారు. మరింత ఉధతంగా ఉంటే అధికారులను సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు.



సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

సుబ్బారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి -పెద్దాపురం

పెద్దాపురం ఎంఎల్ఎగా, కమ్యూనిస్టు పార్టీ నేతగా దుర్వాసుల వెంకట సుబ్బారావు చేసిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. గురువారం యాసలపు సూర్యారావు భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు ఆధ్వర్యంలో సుబ్బారావు వర్ధంతి సభలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. సూరిబాబు మాట్లాడుతూ 1955 ఎన్నికల్లో ఆయనకమ్యూనిస్టు పార్టీ తరఫున పోటీ చేసి విజయ సాధించారన్నారు. అప్పట్లో ఆయన వాగ్దాటి, సామాజిక సమస్యలపై ఆయన విశ్లేషణ మంత్రులను, మేధావులను ఆకట్టుకునేదని పార్టీ సీనియర్ నాయకులు తమకు చెప్పేవారన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా విశ్వనాథం, సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, యాసలపు రమేష్, రొంగల సుబ్బలక్ష్మి, కూనిరెడ్డి అప్పన్న, రొంగల అరుణ్ కుమార్, దేవత రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

యానాం వార్తలు



వికలాంగుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న నాయుడు

వికలాంగుల హక్కులు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక బీచ్ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ ఆఫీసులో మల్టీ డిసబిలిటీ ప్రాజెక్టులో భాగంగా వికలాంగుల తల్లిదండ్రులకు వికలాంగుల యొక్క హక్కులు చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.నాయుడు మాట్లాడుతూ బహుళ వైకల్యం కలిగిన వ్యక్తులకు ప్రభుత్వం అనేక రకాల సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వికలాంగుల చట్టం 2016లో ఉద్యోగ అవకాశాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడం, ఉచిత పరికరాలు, ఉచిత విద్య, స్కాలర్‌షిప్ వంటి పథకాలును వివరించారు. మల్టీ డిజేబుల్ ప్రాజెక్టు ద్వారా ఉచితంగా ఇంటి వద్ద ఫీషియోథెరపి, న్యూట్రిషన్ ఫుడ్, ఒకేషనల్ ఆక్టివిటీస్ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ విజయదుర్గ, జి.సుశీల, స్కూల్ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



లక్ష్మణ ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

పెద్దింటి లక్ష్మణప్రసాద్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - యానాం

యానాం, కారైకాల్‌లో గ్రామసేవక్‌గా పని చేసి గురువారం ఉద్యోగ విరమణ చెందిన పెద్దింటి లక్ష్మణ ప్రసాద్‌ను తోటి ఉద్యోగులు గురువారం ఘనంగా సత్కరించారు. నెహ్రూనగర్‌లోని బిడిఒ కార్యాలయంలో జాయింట్ బిడిఒ ఆర్.రంగనాథన్, ఎక్స్‌టెన్షన్ అధికారి కెన్నెడీ బృందం, లక్ష్మణ ప్రసాద్, నాగలక్ష్మి దంపతులను సత్కరించారు. అనంతరం జ్ఞాపికలు అందజేశారు.

లాభదాయకంగా జీడిపప్పు పరిశ్రమ

ప్రజాశక్తి - కొవ్వూరు

జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమ రాష్ట్రంలో లాభదాయకంగా నడుస్తుందని ఎపి సెరికల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. గురువారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని పొలంలో జీడి పండు నుంచి పిక్కలను వేరు చేసే యంత్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యంత్రం రోజుకి మూడు వేల కిలోల గింజలను కాయల నుంచి వేరు చేస్తుందన్నారు. 1.2 లీటర్ల పెట్రోల్‌తో గంటకి 300 కిలోల గింజలను ఈ యంత్రంతో వేరు చేయవచ్చునని తెలిపారు. రైతులు సాంప్రదాయ పద్ధతిని అనుసరిస్తే రూ.3వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపిడిఒ వివివిఎస్.రామారావు తెలిపారు. గురువారం మండలంలోని సూర్యారావుపాలెంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను రోడ్డుమీద వేయకుండా, ఇంటింటికి వచ్చి సేకరించే పారిశుధ్య సిబ్బందికి చెత్తను తడి, పొడి చెత్తగా వేరువేరుగా అందజేయాలన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించామని, కావున ఆ ప్లాస్టిక్‌ను వినియోగించరాదని సూచించారు. ఈ పర్యటనలో పంచాయతీ కార్యదర్శి హిమకిరణ్ పాల్గొన్నారు.

సిఐకు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు సర్కిల్ పరిధిలో ఓఎన్‌జిసి వెల్స్, రిగ్స్ ల వద్ద జరుగుతున్న దొంగతనాలు, నేరాలను సమర్ధవంతంగా ఛేధించినందుకు సిఐ నరేష్ కుమార్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. విజయవాడలో జరిగిన అన్‌షోర్ సెక్యూరిటీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఈపురస్కారం అందుకున్నారు.

మహిళలకు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కుటుంబం సక్రమంగా నడవాలంటే భర్తతోపాటు భార్య కూడా సంపాదించాలని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. గురువారం మహిళా శక్తి భవనంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ శిబిరాన్ని ఎంపిపి సందర్శించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు, పిల్లలు విద్య ఇతర అవసరాలకు స్త్రీలు ఇంటి వద్ద నుండే డబ్బు సంపాదించేందుకు టైలరింగ్, మగ్గం వర్క్, ఇతర కుటీర పరిశ్రమలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు చిక్కాల రాజేశ్వరి, సాదే లోవరాజు, ఎంపిటిసి కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు మహిళలు ఉన్నారు.

ఉన్నత ప్రమాణాల విద్యను అందించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఉపాధ్యాయులంతా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ కోరారు. మండలంలోని చొల్లంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రమాణాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇది తన అభ్యర్థన గా భావించి ఎవరికివారుగా బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. అనంతరం ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.మంగాయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా కిషోర్ బాబు

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడి ఎంపిడిఒ శివరామకృష్ణయ్య శిక్షణకు వెళ్లడంతో ప్రత్తిపాడు ఎంపిడిఒ కిషోర్ బాబును రౌతులపూడి ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఉన్నత అధికారులు నియమించారు. బాధ్యతలు స్వీకరించిన కిషోర్ బాబును పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో సమావేశమై పలు విషయాలపై చర్చించారు.